ట్రాక్ ఇలా.. నడిచేదెలా?

- వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి నిధులు మంజూరు
- అయినా పూర్తి కాని పనులు
- పూర్తి చేయాలంటున్న వాకర్స్



వెదిర జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్

రామడుగు: గ్రామీణ ప్రాంతంలోని యువతతో పాటు వాకర్స్ కోసం రెండేళ్ల క్రితం వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం సుడా (శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ) ద్వారా నిధులు కేటాయించింది. ఈ నిధులతో మండలంలోని వివిధ గ్రామాల్లో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ నిర్మించాలని ప్రతిపాదనలు రూపొందించారు. అసంపూర్తి పనులతో యువకులు, వాకర్స్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండంలోని వెదిర, కిష్టాపూర్, దేశరాజ్‌పల్లి, వెలిచాల, కొక్కెరకుంట, వన్నారం, గ్రామాలను గత ప్రభుత్వం సుడా పరిధిలోకి తీసుకెళ్లింది. ఈ గ్రామాలకు ప్రత్యేకంగా సుడా ద్వారా నిధులు మంజూరయ్యాయి. వెదిరలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు రూ.15 లక్షలు, దేశరాజ్‌పల్లిలో ఓపెన్ జిమ్‌కు రూ. 15 లక్షలు, కొక్కెరకుంటలో ఓపెన్ జిమ్‌కు రూ. 5 లక్షలు, కిష్టాపూర్‌లో ఓపెన్ జిమ్‌తో పాటుగా వీధి లైట్ కోసం రూ.7 లక్షలు, వెలిచాల గ్రామంలో సిమెంట్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ. 50 లక్షలు సుడా ద్వారా నిధులు మంజూరయ్యాయి. కొన్ని గ్రామాలలో 80 శాతం మేర పనులు పూర్తయినప్పటికీ మరికొన్ని గ్రామాలలో అసంపూర్తిగా ఉండడంతో ఉపయోగకరంగా లేని పరిస్థితి. వెదిర జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నిర్మాణం చేస్తున్న వాకింగ్ ట్రాక్ పనులు నేటికి పూర్తి చేయకపోవడంతో ఉపయోగించుకొలేని పరిస్థితి ఉందని యువకులు వాపోతున్నారు.దేశరాజ్‌పల్లి, వన్నారం, కొక్కెరకుంట, కిష్టాపూర్ గ్రామాల్లో అదే పరిస్థితి. వెలిచాలలో సిమెంట్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

యువత హర్షం

పట్టణాలకే పరిమితమైన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తుండటంతో యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్, ఆర్మీ ఉద్యోగాలు సాధకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సంబంధిత అధికారులు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాని విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



మా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ యువతకు ఉపయోగకరంగా ఉంటుంది. చాలా రోజుల నుంచి వాకింగ్ ట్రాక్ లేకపోవడంతో యువకులు, వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వచ్చింది. అసంపూర్తి వాకింగ్ ట్రాక్‌ను పూర్తి స్థాయిలో నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నాం.

– నరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెదిర

పనుల్లో జాప్యం



వాకింగ్ ట్రాక్ లేకపోవడంతో ఏళ్లుగా ఇబ్బందిపడ్డాం, రోడ్డు వెంట వాకింగ్ చేస్తూ పలుమార్లు ప్రమాదాల నుంచి బయటపడ్డాం. ఇప్పుడు పాఠశాల ఆవరణలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటుతో ఎటువంటి ప్రమాదం ఉండదు. కానీ నిర్మాణ పనుల జాప్యంతో ఇబ్బందిపడుతున్నాం. సంబంధిత అధికారులు పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం.

– గాజుల ఆనందం, ఎల్ఐసీ ఉద్యోగి, వెదిర



హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధి మామిళ్లవాడలోని ఓ కాలనీలో నివాస గృహాల మధ్య మురుగునీరు నిలిచి దుర్గంధం వెలువడుతోంది. ఫలితంగా దోమలు వృద్ధి చెందుతున్నాయని, రోగాల బారిన పడే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి మురుగునీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కె.సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్ సెల్ నంబర్: 83330 04821

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

క్లుప్తంగా

కుక్కలు, కోతుల బెడద

శంకరపట్నం: వరి పొలాలకు కుక్కలు, కోతుల బెడద ఎక్కువైందని రైతులు వాపోతున్నారు. వరి పొట్టదశకు చేరడంతో కోతుల గుంపు పొలాల్లోకి చేరుతున్నాయి, దీంతో పొట్టదశలోని వరి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలను కాపాడుకోవడానికి రైతులు టపాసులు పేల్చుతున్నారు. మండలంలోని ఏరడపల్లి గ్రామంలో బుధవారం పొట్టదశలోని వరి పొలాన్ని శునకాలు ధ్వంసం చేస్తుండగా ఓ రైతు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. యాసంగిలో ఆడ,మగ సీడ్ సాగు చేసిన రైతులు పొలాల వద్ద కాపలా ఉంటున్నారు.

'ఆసరా'కు ఎదురుచూపు

చిగురుమామిడి: మండలంలోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఆసరా పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులతో బాధ వ్యక్తం చేస్తున్నారు. కొందరు గ్రామ పంచాయతీల వద్ద కార్యదర్శుల కోసం వేచిచూస్తున్నారు. మరికొందరు బ్యాంకులకు వెళ్లి డబ్బులు పడ్డాయో లేదా అని తెలుసుకుంటున్నారు. కొత్త పెన్షన్ల్ రాకపోగానెలనెలా వచ్చే పాత పెన్షన్ ఏవంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, కొహెడతో పాటు ఇతర మండలాల్లో పెన్షన్ డబ్బులు ఖాతాల్లో జమయ్యాయనే సమాచారం తెలుసుకొని విస్తుపోతున్నారు. పెన్షన్ డబ్బులు విడుదల చేయాలని కోరుతున్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

మానకొండూర్: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల విద్యార్థులు బుధవారం క్షేత్ర పర్యటనలో భాగంగా స్థానిక వ్యవసాయ పంట పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా టీచర్లు విద్యార్థులకు వివిధ అంశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లసీనా, టీచర్లు లావణ్య, శ్వేత పాల్గొన్నారు.

క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న పీపుల్స్ పార్టీ నాయకులు

హుజూరాబాద్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఓటును సరిగా వినియోగించుకోకపోవడం బాధాకరమని పీపుల్స్ పార్టీ నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కృషి ఫలితంగా ఓటుహక్కు పొందిన వారికి ఏలా వినియోగించుకోవాలో తెలియకపోవడం విడ్డూరంగా ఉందని, వీరిపట్ల క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు గడ్డం రఘు, వెంకన్న, పోగుల రాజశేఖర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు



కాలిపోయిన ద్విచక్రవాహనాలు

జమ్మికుంట: ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసి బైక్‌లను దహనం చేసిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. మండలంలోని మడిపల్లి గ్రామంలో నేరెళ్ల వెంకన్న ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో సమీప ఇళ్లకు చెందిన వ్యక్తులు ఐదు బైక్‌లను పార్కింగ్ చేస్తుంటారు. మంగళవారం రాత్రి ఓ వ్యక్తి బైక్‌లపై పెట్రోల్ పోసి నిప్పంటిచి పారిపోయాడు. బాధితుడు ముక్కెర పవన్ కళ్యాణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

వీణవంక: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తిరుపతి తెలిపారు. మండలంలోని చల్లూరు గ్రామంలో పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా అనుమతి లేకుండా సుమారు రెండు క్వింటాళ్ల బియ్యాన్ని ఆటోలో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల కేంద్రానికి చెందిన వ్యక్తి తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్ఐ వివరించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో బుధవారం జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మీ తనిఖీలు నిర్వహించారు. ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం (ఎఫ్ఐవీఈఎస్)లో భాగంగా కొత్తపల్లిలోని శ్రీరాజరాజేశ్వర, కార్తికేయ ఫెర్టిలైజర్స్, బావుపేటలోని మల్లికార్జున, చింతకుంటలోని డీసీఎంఎస్, నాగుల మల్యాలలోని పీఏసీఎస్‌లలో యూరియా, డీఏపీ, విత్తనాల నిల్వలను పరిశీలించారు. అదేవిధంగా వివిధ ఫర్టిలైజర్ దుకాణాల్లోని స్టాక్, తదితర రికార్డులను తనిఖీ చేశారు.



జమ్మికుంట: బహుమతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిట్స్

హుజూరాబాద్: పాఠశాలల్లో నిర్వహించే సైన్స్ ఫేర్‌లతో విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత బయటపడుతుందని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో స్కూల్ చైర్మన్ జోస్ నెడుంతుండమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌కు హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని, సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని, భవిష్యత్ సైన్స్ రంగంపై ఆధారపడి ఉందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన వివిధ రకాల సైన్స్ ఎగ్జిబిట్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం గీతాషాజు, డైరెక్టర్ షాజు థామస్, టీచర్లు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జమ్మికుంట: అవగాహనతోనే విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఎంఈవో హేమలత అన్నారు. బుధవారం మండలంలోని కోరపల్లిలో ధర్మారం, కోరపల్లి గ్రామాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక, నూతన పరిచయాలు, పరిస్థితులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కోరపల్లి పాఠశాల హెచ్ఎం సమ్మయ్య, ధర్మారం హెచ్ఎం తిరుపతి, ఉపాధ్యాయులు పురుషోత్తమమూర్తి, రాజిరెడ్డి, రవీందర్, బాలరాం, కూమారి విద్యార్థులు పాల్గొన్నారు.



రాకెట్ మోడల్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో, పాఠశాల యాజమాన్యం

ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన ట్రాన్స్‌కో అధికారులు



జనరేటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

హుజూరాబాద్: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని బుధవారం ట్రాన్స్‌కో అధికారులు సందర్శించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన జనరేటర్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోగానే ఆటోమేటిక్‌గా జనరేటర్ ప్రారంభమయ్యే సదుపాయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ట్రాన్స్‌కో డీఈ లక్ష్మారెడ్డి, ఏఈ శ్రీనివాస్‌గౌడ్, పలువురు ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు ప్రతిపాదన విరమించుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

హుజూరాబాద్: మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు ప్రజాసంఘాల నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. హుజూరాబాద్‌లో డంపింగ్‌యార్డు నిర్మాణ ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. డంపింగ్‌యార్డు నిర్మాణంతో వ్యవసాయ క్షేత్రాలు, ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ప్రజలకు హాని కలిగించే ప్రతిపాదనను విరమించుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో నాయకులు మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్, కలీద్ హుస్సేన్, ఉప్పు శ్రీనివాస్, గడిపె రాజు, కొలిపాక సమ్మయ్య, తులసి లక్ష్మణమూర్తి, పెండ్యాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈఈపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఈఈ రొడ్డ యాదగిరిపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 19న విధుల్లో ఉన్న ఈఈ రొడ్డ యాదగిరిపై దాడి చేసిన వారిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దండు అంజయ్య, చెంచాల నవీన్, నలిగంటి మల్లేశ్వరి, దండు వరలక్ష్మి పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూజలు చేస్తున్న అర్చకులు

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామంలో భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మూడు రోజు కొనసాగాయి. అర్చకులు నరసింహాచార్యులు ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో గ్రామ ప్రజలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

తండ్రి మృతదేహం తెప్పించాలని వినతి



కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌కి వినతిపత్రమిస్తున్న కుమారుడు, నాయకులు

గన్నేరువరం: తండ్రి మృతదేహం స్వగ్రామం గునుకులకొండాపూర్ చేరుకునేలా కృషి చేయాలని మృతుడి కుమారుడు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను వేడుకున్నాడు. బుధవారం మాజీ సర్పంచ్ సొల్లు అజయ్‌వర్మ, రజక సంఘం యూత్ రాష్ట్ర అధ్యక్షుడు దుబ్బాక రమేశ్‌తో కలిసి కరీంనగర్‌లో సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన లింగంపల్లి మొండయ్య అలియాస్ గత్తర మొండయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 3న గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు, పిల్లలు పెళ్లీడుకు వచ్చారని, ఇళ్లు శిథిలావస్థకు చేరుకుందని మంత్రికి వివరించారు. కార్యక్రమంలో నరేశ్, పొన్నాల రాము, ఎస్ రాజు, లింగంపల్లి అనిల్, లింగంపల్లి శ్రీకాంత్, దుబాయ్ శ్రీనివాస్, ఉప్పరపల్లి శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

గంగాధర: పోస్టల్ పథకాలు, సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే గ్రామీణ పోస్టాఫీసులకు ఆదరణ లభిస్తోందని తపాలాశాఖ కరీంనగర్ నార్త్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గంగాధర, కొత్తపల్లి, రామడుగు, బోయినపల్లి సబ్ పోస్టాఫీసుల పరిధిలోని గ్రామాల బ్రాంచ్ పోస్టుమాస్టర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ... ఆర్థిక చేయూతనిచ్చే అనేక పథకాలు తపాలాశాఖలో అందుబాటులో ఉన్నాయని, సుకన్యఖాతా, మంత్లీ ఇన్‌కమింగ్, టీడీ, ఆర్డీ, ఎస్బీ ఖాతాలు వివరించాలన్నారు. అన్ని పథకాల్లో నార్త్ డివిజన్‌ను ప్రథమ స్థానంలో ఉండాలన్నారు. సమావేశంలో దాది మల్లేశం, బీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.





చొప్పదండి: హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు, హుజూరాబాద్‌లోని పరీక్ష కేంద్రం వద్ద..

మొదటిరోజు ప్రశాంతం

చొప్పదండి: పట్టణంలో ఇంటర్ ప్రథమ పరీక్ష ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలో తొలిరోజు 329 మంది విద్యార్థులకు పరీక్షా కేంద్రం కేటాయించగా ఐదుగురు గైర్హాజరయ్యారు.

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మైనార్టీ బాలుర పాఠశాల, కాకతీయ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ పటిష్ఠ చర్యలు చేపట్టింది.

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ ,ప్రవంతి, కాకతీయ జూనియర్ కళాశాలల్లో మొత్తం 761 మంది విద్యార్థులకు 70 మంది గైర్హాజరయ్యారు. పోలీస్ సిబ్బంది పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.



మానకొండూర్: సెంటర్‌లోకి వెళ్తున్న విద్యార్థులు

మానకొండూర్: మానకొండూర్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు బారులు తీరారు. దేవంపల్లి గురుకుల పాఠశాలలో 180 మంది విద్యార్థులకు 170 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కేంద్రానికి విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. 135 మందికి 132 మంది హాజరైనట్టు పరీక్షల విభాగం ఛీఫ్ సూపరింటెండెంట్ జనార్దన్ తెలిపారు. ముగ్గురు విద్యార్థులు గైర్హజరయ్యారని పేర్కొన్నారు.

వీడ్కోలు హంగామా



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

సైదాపూర్: మండలంలోని సోమారం ఆదర్శ పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు నిర్వహించారు. ప్రిన్సి పాల్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. పది ఫలితాల్లో మంచి మార్కులు సాధించాలని, భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశాలిచ్చారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులందరికి ఎస్‌బీఐ జీరో ఖాతాలు తెరిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈజీఎస్ కూలీలకు రూ.600 వేతనం చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న వడ్ల రాజు

శంకరపట్నం: ఉపాధిహామీ కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వడ్ల రాజు డిమాండ్ చేశారు. మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో బుధవారం కూలీల పని ప్రదేశాన్ని సందర్శించి మాట్లాడారు. పని ప్రదేశంలో టెంట్, తాగునీటి వసతితోపాటు మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని, అన్ని గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు.

హామీల అమలుపై ప్రశ్నించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా ప్రతీ నాయకుడు, కార్యకర్త ప్రజల గొంతుకై ప్రశ్నించాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఇల్లందకుంట మండల బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలు నెరవేర్చడంలో పూర్తిస్థాయిలో విఫలమయ్యారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడవకముందే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను సంపాదించుకుందన్నారు. హామీలన్నీ నెరవేర్చే వరకు కాంగ్రెస్ నాయకులను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని పేర్కొన్నారు. మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా ముక్తకంఠంతో కోరుకుంటున్నారని వివరించారు. పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతీ నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని స్పష్టం చేశారు. అతి త్వరలోనే సర్పంచ్, మున్సిపాలిటీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయని కష్టపడి పనిచేసిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. ఈనెల 10 వరకు అన్ని గ్రామాల్లో వివిధ కమిటీలు వేయాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ రామస్వామి, సీనియర్ నాయకులు చుక్కా రంజిత్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.